సాక్షి
కర్నూలు
మంగళవారం । 14 । మార్చి । 2023



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ చేశారు.



పెయ్య దూడలే పుడతాయి!

పెయ్య దూడల ఉత్పత్తిని పెంచేందుకు పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ కలసి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. లింగనిర్ధారణ వీర్యం సూదులను అందుబాటులోకి తెచ్చాయి. 8లో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	19.8
గరిష్టం	38.4

న్యూస్‌రీల్

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు నేటి(మంగళవారం) నుంచి 1, 3, 5 వ సెమిస్టర్ పరీక్షలు జరగనున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 68 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలకు 7,847 మంది రెగ్యులర్, 13,956 మంది సప్లిమెంటరీ, థర్డ్ సెమిస్టర్‌కు 1,416 రెగ్యులర్, 11,130 మంది సప్లిమెంటరీ, 5వ సెమిస్టర్ పరీక్షలకు 6,706 రెగ్యులర్, 6,508 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలకు హాల్ టికెట్‌తో పాటు కాలేజీ గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పోలీసుల దుందుడుకు చర్య

- మున్సిపల్ వైస్ చైర్మన్‌పై దాడి



మున్సిపల్ వైస్‌చైర్మన్‌ను తోస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. చొక్కా పట్టుకుని దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం గేటు లోపల టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండడంతో వారందరినీ బయటికి వెళ్లాలని పోలీసులు సూచించారు. ముందుగా టీడీపీ వారిని పంపించమని అన్నందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. తనపై టూటౌన్ సీఐ శ్రీనివాస్ నాయక్, పోలీసులు దాడి చేసినట్లు నరసింహులు తెలిపారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఇరువురిని తోసి పంపించామని, ఎవరిపై దాడి చేయలేదని సీఐ వివరణ ఇచ్చారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ సరళిని అధికారులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అక్కడే ఉండి పోలింగ్ కేంద్రాల్లో ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా లైవ్‌లో పరిశీలించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ ఎంఎం నాయక్ ఆరు పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితిని ఎప్పటికిప్పుడు వెబ్‌కాస్టింగ్ ద్వారా తెలుసుకున్నారు.

ఓటు వేసిన కలెక్టర్, జేసీ

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు ఉన్నతాధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు కలెక్టరేట్ వెనుక ఉన్న ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో క్యూలైన్‌లో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీక్యాంపు గర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాలలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఆయన సతీమణి సి.ప్రసన్న ఓటును వేశారు. దామోదరం సంజీవయ్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పోలింగ్

జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 107 కేంద్రాల్లో ఎక్కడా చిన్న సంఘటన కూడా చోటు చేసుకోలేదన్నారు.



కర్నూలు: పోలింగ్ కేంద్రం వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తున్న ఓటర్లు







ప్రజాస్వామ్య స్ఫూర్తి: ఓటు హక్కు వినియోగించుకున్న కర్నూలు నగర మేయర్ రామయ్య, ఓటు వేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్



వెల్దుర్తి: పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సుకు సీల్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది



కొలిమిగుండ్ల: ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దంపతులు

పోలింగ్ ప్రశాంతం

కర్నూలు, నంద్యాల జిల్లాలో ముగిసిన పోలింగ్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 96.43 శాతం
- కర్నూలులో రిగ్గింగ్ జరిగిందని టీడీపీ నీచ రాజకీయం
- వాస్తవం లేదని కొట్టిపారేసిన పోలీసులు
- ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ

ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో కీలక ఘట్టం ముగిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీతో పాటు 'స్థానిక సంస్థల' ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రెండు జిల్లాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. ఎన్నికల అధికారులు, పోలీసులు గట్టి ఏర్పాట్ల మధ్య ఎన్నికలు నిర్వహించారు. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఈ ఓటింగ్ శాతాన్ని అభ్యర్థులు ఎవరికి వారు తమకు అనుకూలంగా విశ్లేషించుకుంటున్నా.. వైఎస్సార్‌సీపీకే అనుకూలమనే చర్చ జరుగుతోంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు



కర్నూలు: ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. మొత్తం 231 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. మొదటి రెండు గంటలు పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ తర్వాత ఓటర్లు భారీగా చేరుకుని పోలింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 4గంటలలోపు స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోలింగ్ ముగిసింది. పట్టభద్రుల కోటాలో 4గంటలకు కూడా భారీగా క్యూలైన్లలో ఓటర్లు ఉన్నారు. క్యూలైన్లలో ఉన్నవారిని ఓటు వేసేందుకు అనుమతించారు. స్థానిక సంస్థల కోటాలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులు కూడా ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ ఆద్యంతం సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగింది. రెండు జిల్లాల కలెక్టర్లు కమాండ్ కంట్రోల్ రూంల నుంచి పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటర్లతో కలిసి వచ్చిన ప్రజాప్రతినిధులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య తమ పార్టీ కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి వచ్చారు. ఆర్డీవో కార్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నంద్యాల, పత్తికొండ, ఆత్మకూరు, ఆదోని, డోన్‌లో కూడా అక్కడ స్థానిక ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రిగ్గింగ్ పేరుతో టీడీపీ నీచ రాజకీయం

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 270, 283 పోలింగ్ బూతుల్లో వైఎస్సార్‌సీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఎస్పీ ప్రసాద్, కర్నూలు డీఎస్పీ మహేశ్, సీఐ తబ్రేజ్ బూత్‌లకు హుటాహుటిన చేరుకున్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడం చూసి ఫిర్యాదుపై అవాక్కయ్యారు. టీడీపీ నేతలను కూడా విచారించారు. ఎక్కడ రిగ్గింగ్ జరగలేదని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లోకి వెళ్లకుండా టీడీపీ నేతలు అడ్డుకోవడంతో రెండు పార్టీల మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఎన్నికల కమిషన్‌కు వెళ్లిన ఫిర్యాదు పూర్తి అవాస్తవమని పోలీసులు తేల్చేశారు. ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికల్లో అలజడి సృష్టించాలని టీడీపీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. నందికొట్కూరులో గ్రాడ్యుయేట్ ఓటు వేసేందుకు టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి తన అనుచరులతో కలిసి వచ్చారు. అయితే అధికారులు ఓటు ఉన్నవారు మాత్రమే పోలింగ్ బూత్‌లోకి వెళ్లాలని చెప్పారు. అయినప్పటికీ టీడీపీ కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు సర్ది చెప్పి ఓటు హక్కు ఉన్నవారినే అనుమతించారు.

16న కౌంటింగ్

మూడు స్థానాలకు ఈ నెల 16న కౌంటింగ్ జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ సిల్వర్ జూబ్లీ కాలేజీలో నిర్వహిస్తారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల కౌంటింగ్ అనంతపురంలో జరగనుంది. అయితే ప్రస్తుతం ఈ బ్యాలెట్ బాక్సులను రెవెన్యూ డివిజన్ పరిధిలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. కర్నూలులో సిల్వర్‌జూబ్లీ కాలేజీ, పత్తికొండలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆదోనిలో సెయింట్ జోసఫ్, నంద్యాలలో కేవీఎస్ ప్రభుత్వ కాలేజీ, ఆత్మకూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డోన్‌లో సుధా ఇంగ్లీష్ మీడియం స్కూలుకు తరలించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల బ్యాలెట్ బాక్సులను నేడు అనంతపురానికి తరలించనున్నారు. స్థానిక సంస్థల బాక్సులను సిల్వర్‌జూబ్లీ కాలేజీకి చేర్చి స్ట్రాంగ్‌రూంలో భద్రపరచనున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

మొత్తం ఓట్లు	: 61,633
పోలైన ఓట్లు	: 43,944
పోలింగ్ శాతం	: 71.30

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

మొత్తం ఓట్లు	: 5,391
పోలైన ఓట్లు	: 4,868
పోలింగ్ శాతం	: 90.30

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ (ఉమ్మడి జిల్లా)

మొత్తం ఓట్లు	: 1178
పోలైన ఓట్లు	: 1136
పోలింగ్ శాతం	: 96.43

సిబ్బందికి అభినందనలు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు విజయవంతమయ్యాయి. కష్టపడిన ఎన్నికల అధికారులు, సిబ్బందికి.. బందోబస్తు నిర్వహించిన పోలీసులకు అభినందలు. జిల్లాస్థాయి సిబ్బందికి, నోడల్ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

– కోటేశ్వరరావు, కలెక్టర్, కర్నూలు

టీడీపీకి ఓటమి తప్పదు

- మంత్రి గుమ్మనూరు జయరాం



ఆలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, డాక్టర్ బోయ మధుసూదన్ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. ఆలూరులో సోమవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే సత్తా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసని, అందుకే ఏ ఎన్నికలు నిర్వహించినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి జయరాం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికే ఓటేశారు

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అభివృద్ధి, సంక్షేమానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ఓటు వేశారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారని స్పష్టమవుతోందన్నారు. సచివాలయ వ్యవస్థతో యువత ఉద్యోగాలు పొందారని, సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. జగనన్నపై నమ్మకంతోనే ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల కోసం కష్టపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కర్నూలు: పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. కర్నూలులోని ఎస్టీబీసీ కళాశాల, ఆర్టీఓ ఆఫీస్, దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్, టంగుటూరు ప్రకాశం పంతులు హైస్కూల్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ యుగంధర్ బాబు, టూటౌన్ సీఐ శ్రీనివాసులు తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



చంటి బిడ్డతో వచ్చి ఓటు వేస్తున్న పాణ్యం ఎంపీపీ నాగశిరీష

చిన్నా ఇదిగో ఇదే బ్యాలెట్ బాక్సు.. ఇందులోనే పాలకుల భవిష్యత్ తేలనుంది. గతంలో రాజుల పాలన ఉండేది. ప్రజల అభిప్రాయాలకు విలువ ఉండేది కాదు. వారు చెప్పిందే శాసనంగా అమలయ్యేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. మన రాతలను మనమే రాసుకుంటున్నాం. మంచి పాలకులను ప్రజలే ఎన్నుకుంటున్నారు.





కర్నూలులో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ కోటేశ్వరరావు, జేసీ రామసుందర్ రెడ్డి దంపతులు

ఎన్నికల చిత్రాలు

పట్టభద్రులు చైతన్యవంతులయ్యారు..

ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు రాజ్యాంగం ఇచ్చిన హక్కును వినియోగించుకున్నారు. సోమవారం కర్నూలు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉన్నతాధికారులు ఓటు హక్కు వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు. ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించి సిబ్బంది ప్రశంసలు అందుకున్నారు.



ఆదోనిలో ఓటు వేసి వస్తున్న దివ్యాంగురాలు





ఆరోగ్య రక్ష: పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం, టెంపరేచర్ చూస్తున్న ఆరోగ్య కార్యకర్త

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

124 కేంద్రాలు ఏర్పాటు

- 70,637 మంది ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు
- ప్రతి కేంద్రంలోని గదిగదికి సీసీ కెమెరాలు
- నాలుగు చోట్ల కంట్రోల్ రూంలు ఏర్పాటు
- లైవ్‌స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షణ
- విలేకర్ల సమావేశంలో ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి ఎస్.వి.ఎస్.గురువయ్యశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాగా నిర్వహిస్తున్న పరీక్షలకు 124 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, రేపటి(బుధవారం) నుంచి మొదలు కానున్న పరీక్షలు ఏప్రిల్ 4వ తేది వరకు జరుగనున్నాయన్నారు. కర్నూలు జిల్లాలోని 73 కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 23,610 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 26,057 మంది హాజరవుతారన్నారు. నంద్యాల జిల్లాలోని 51 కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్ 12,179 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్‌కు 14,792 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలోని గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. లైవ్‌స్ట్రీమ్‌తో పర్యవేక్షణ చేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల్లో తాగు నీటి సదుపాయంతో పాటు, బెంచీలు ఏర్పాటు చేయించామన్నారు. అదేవిధంగా ప్రథమ చికిత్సకు అవసరమైన ఏర్పాట్ల కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 17 కేంద్రాలకు రవాణా సదుపాయం కల్పించాలని ప్రజా రవాణా వ్యవస్థ అధికారులను కోరామని, ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్‌లో అమలులో ఉంటుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు కె.నాగభూషణం రెడ్డి, సి.ప్రభు, ఎం.గోవిందరాజులు, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి

జిరాక్స్ సెంటర్ల మూత

కర్నూలు(రాజ్‌విహార్): ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో జిరాక్స్ సెంటర్లపై ఆంక్షలు విధించినట్లు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జిరాక్స్ సెంటర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మూసి వేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన సుయతీంద్రతీర్థుల సమారాధన

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 10వ సమారాధన వేడుకలు సోమవారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు నేతృత్వంలో ఉత్తరారాధన నిర్వహించారు. ఉదయం స్వామిజీ బృందావనానికి శాస్త్రోక్తంగా విశేష పూజలు కానిచ్చారు. రాత్రి యోగీంద్ర మండపంలో పలువురు ప్రముఖులను సుయతీంద్రతీర్థుల బహుమతులతో సత్కరించారు. మంత్రాలయం మఠానికి చెందిన సూపరింటెండెంట్ ప్రకాష్, ద్వారపాలక పురాణిక్ శ్రీనివాసాచార్, విద్వాన్ హరినాథ్, సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు, బెంగళూరుకు చెందిన వెంకన్నాచార్, విద్వాన్ హరిహరణ్, పంచముఖి గురురాజా, మైసూరుకు చెందిన రాఘవేంద్ర కులకర్ణి, భరతనాట్యం విధూషి అశికను సన్మానించారు. మూడు రోజుల పాటు ఘనంగా వేడుకలు జరిపారు. వేడుకల్లో దాసవాణి, జ్ఞానయజ్ఞ ప్రవచనాలు, హరిదాసుల ప్రదర్శనలు, భజన మండళ్ల కీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సమారాధన ముగింపులో భాగంగా శ్రీమఠం కారిడర్ ప్రాంతంలో నిర్వహించిన లక్షదీపోత్సవం భక్తులను కనువిందు చేసింది.





శ్రీమఠం ఆవరణలో లక్షదీపోత్సవంలో భక్తులు, (ఇన్‌సెట్‌లో) సుయతీంద్రతీర్థుల మూల బృందావనం

గోశాలకు రూ.లక్ష విరాళం

రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు విరాళాలు వస్తూనే ఉన్నాయి. సోమవారం బెంగళూరుకు చెందిన శ్రీమతి ఉషా రాయకర్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆమెను శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. వేడుకలో మఠం మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారులు వ్యాసరాజాచార్, బిందు మాధవస్వామి, ద్వార పాలక అనంత స్వామి పాల్గొన్నారు.

పెయ్య దూడలే పుడతాయి!

- అందుబాటులో ఎద సూదులు
- ఒక పాడి పశువుకు రెండు డోసులు
- పూర్తి ధర రూ.1,350, సబ్సిడీ రూ.850
- రెండు డోసులు వేసినా చూలు కట్టకపోతే రూ.500 వెనక్కి
- ఉమ్మడి జిల్లాలో 1,800 పశువులకు కృత్రిమగర్భధారణ


పశువుకు కృత్రిమ గర్భధారణ సూది వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): పెయ్య దూడల ఉత్పత్తిని పెంచి పాడిని అభివృద్ధి చేసేందుకు పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టాయి. లింగనిర్ధారణ వీర్యం సూదులను అందుబాటులోకి తెచ్చాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆవులు, గేదెలకు సూదులు వేసే కార్యక్రమం గతేడాది నవంబరు నెల నుంచి చురుగ్గా జరుగుతోంది. కర్నూలు జిల్లాలో 84, నంద్యాల జిల్లాలో 114 సెంటర్లలో ఇప్పటి వరకు 1,800 పశువులకు ఎద సూదులు వేశారు.

95 శాతం కచ్చితత్వం

పశుగణాభివృద్ధి సంస్థ కొన్నేళ్లుగా చేపడుతున్న కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా పెయ్య దూడలు 50 శాతం వరకే పుడుతున్నాయి. ప్రస్తుతం పెయ్య దూడల అభివృద్ధి పథకం 95 శాతం కచ్చితత్వంతో సాగుతోంది. ప్రభుత్వం 2022–23లో రాష్ట్రంలో లక్ష, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5 వేల పెయ్య దూడలు అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని ఇచ్చింది.

మేలైన పథకం

''పెయ్య దూడలు పుట్టాలి.. రైతన్నకు లక్ష్మీకళ పట్టాలి...నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు'' అనే నినాదంతో పెయ్య దూడల అభివృద్ధి పథకాన్ని పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థలు రైతుల్లోకి తీసుకెళ్తున్నాయి. ఈ పథకంతో పెయ్య దూడలు పుట్టి, పాల దిగుబడి పెరిగి.. రైతులకు ఆదాయం లభించనుంది. తక్కువ సమయంలో ఎక్కువ మేలు జాతి పశుసంపద వృద్ధి అయ్యే అవకాశం ఉంది. పాడి అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్లు, ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు సూచిస్తున్నారు.

చూలు కట్టకపోతే డబ్బులు వెనక్కి

ఎద సూది పూర్తి ధర రూ.1,350 ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తోంది. రైతులు రూ.500 మాత్రమే భరించాల్సి ఉంది. మొదటి డోసుతో చూలు కట్టకపోతే రెండోసారి కూడా వేస్తారు. రెండు డోసులకు కలిసి ప్రభుత్వం ఈ ధరను నిర్ణయించింది. ఆవులు, గేదెలు ఎదకు వచ్చినపుడు మాత్రమే సూది వేస్తారు. 21 రోజుల్లో మళ్లీ ఎదకు రాకపోతే చూలు కట్టినట్లే. ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,800 పశువులకు సూదులు వేయగా ఒక్క పశువు కూడా మళ్లీ ఎదకు రాలేదు. రెండు డోసులు వేసినా పశువు చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి ఇస్తారు. మొదటి డోసు వేసిన తర్వాత 21 రోజులకు మళ్లీ ఎదకు వస్తే రెండో డోసు వేస్తారు. చూలు కట్టి పెయ్య దూడ పుట్టకపోతే రూ.250 వెనక్కి ఇస్తారు.

పెరగనున్న పాల ఉత్పత్తి

నాటు గేదెలు, ఆవులకు కూడా ఈ సూదులు వేస్తారు. ముర్రా ఆంబోతులు, ఆవులకు సంబంధించి గిర్, షాహివాల్ ఆంబోతుల వీర్యంతో ఈ సూదులు తయారు చేస్తారు. దీంతో మేలు జాతి దూడలు పుట్టి ప్రతి గ్రామంలో 250 నుంచి 300 లీటర్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. పాడి అభివృద్ధి చెందడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈనిన 60 నుంచి 90 రోజులలోపు పశువులు ఎదకు వచ్చినపుడు ఈ సూదులు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

రైతులకు వరం



పెయ్యదూడల అభివృద్ధి పథకం రైతులకు వరం లాంటిది. ఈ పథకం కింద లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ సూదులు వేసే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. నాటు అవులు, గేదెలకు కూడా ఈ సూదులు వేయవచ్చు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ రాజశేఖర్, డీడీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

దాహం తీర్చుకునేందుకు వెళ్లి..


మృతి చెందిన పెద్ద పెద్దయ్య

బనగానపల్లెరూరల్: టంగుటూరు గ్రామానికి చెందిన పెరుమాళ్ల పెద్ద పెద్దయ్య(41) అనే వ్యక్తి గ్రామ సమీపంలోని మంచినీటి పథకం కుంటలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెద్దపెద్దయ్య ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామ సమీపంలోని యాగంటిపల్లె మంచినీటి పథకంలో శవమై కనిపించాడు. నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, నీటి కుంటలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాహం తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కుంటలో పడి మృతి చెందినట్లు కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన శివరామిరెడ్డి (ఫైల్)

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడుకు చెందిన గంగు శివరామి రెడ్డి (54) మృతి చెందాడు. ఆదివారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో జరిగిన వేడుకలో పాల్గొని బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుసైడ్ ఉన్న సిమెంటు రైలింగ్‌కు ఢీకొని కింద పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన ఆయనను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా రాత్రి కోలుకోలేక మృతిచెందాడు. బైక్ స్టాండ్ అనుకోకుండా రోడ్డుకు తగిలి అదుపు తప్పి కింద పడటంతో తన తండ్రి మృతిచెందినట్లు మృతుడు పెద్దకుమారుడు సర్వేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ కేసు నమోదు చేశారు. సోమవారం మృతదేహానికి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి మద్యానికి బానిసయ్యాడని కుమార్తె ఆత్మహత్య

కర్నూలు: తాగుడుకు తండ్రి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని కలత చెందిన కుమార్తె నందిని (23) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కర్నూలు పాతబస్తీలోని మేదర వీధిలో నివాసముంటున్న చంద్రకంటి పాపారాయుడు ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య శాంతి బండిమెట్టలోని ప్రాథమిక వైద్యశాలలో ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. వీరికి ఒక కొడుకు, కూతురు సంతానం. కుమారుడు ఎంబీఏ పూర్తి చేసి హైదరాబాదులో ఉద్యోగం చేస్తుండగా కూతురు నందిని కూడా సుబ్బారెడ్డి కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసి సుంకేసుల రోడ్డులోని సిస్టర్ స్టానిస్లాస్ స్కూల్‌లో ఏడు మాసాలుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం స్కూల్‌కు సెలవు ఇవ్వడంతో ఇంటి దగ్గరే ఉండి మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేసింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేసింది. తండ్రి పాపారాయుడు మద్యానికి అలవాటు పడి కొంతకాలంగా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని కలత చెంది ఇంట్లోని గదిలో చీరతో ఉరి వేసుకుంది. అదే సమయంలో తండ్రి ఇంటికి చేరుకున్నాడు. ఉరికి వేలాడుతూ కూతురు కనిపించడంతో గదిలోకి వెళ్లి కుటుంబ సభ్యుల సాయంతో కిందికి దించి ఆటోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నందిని మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఒకటవ పట్టణ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

కేఎంసీలో ఎన్ఎంసీ సభ్యుల తనిఖీలు


వార్డులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్ఎంసీ బృంద సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లో సోమవారం నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. పల్మనరీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఈఎన్‌టీ, అనెస్తీషియాలజీ, ఆబ్‌స్ట్రిక్ అండ్ గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఫార్మకాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ విభాగాల్లో వసతులను పరిశీలించారు. బృందంలో డాక్టర్ తుకారామ్ అవాద్(ముంబయి), డాక్టర్ కూస కుమార్ సాహ(పాండిచ్చేరి), డాక్టర్ మారి రాజ్ (బెంగళూరు), డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్(సికింద్రాబాద్), డాక్టర్ తమిళ్ సెల్వన్(పాండిచ్చేరి), డాక్టర్ టి. మురుగన్(చెన్నై), డాక్టర్ సుకుమార్ మిత్ర(కోల్‌కతా), డాక్టర్ అనిరుద్ధా సెంగుప్త(కోల్‌కతా), డాక్టర్ సూర్యప్రభ(హైదరాబాద్), డాక్టర్ నీలవేణి(హైదరాబాద్), డాక్టర్ ఎ. గీత(బెంగళూరు) ఉన్నారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు పీజీ సీట్లకు అవసరమైన వసతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ చిట్టినర్సమ్మ, డాక్టర్ సాయిసుధీర్, వివిధ విభాగాధిపతులు వారికి వివరాలు అందించారు.

ఉరుకుంద హుండీలో చోరీ సొత్తు రికవరీ

- దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు


దొంగల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ హుండీలో చోరీ చేసిన సొత్తును పోలీసులు 24 గంటల్లోనే రికవరీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను కోసిగి సీఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి వెల్లడించారు. కౌతాళం ఎస్సీ కాలనీకి చెందిన బావిగడ్డ గోపి, ఆనంద్‌రాజు, రాజు జల్సాలకు అలవాటు పడ్డారని తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపోక వీరు శనివారం తెల్లవారు జామున ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలోకి ప్రవేశించి హుండీలో సొత్తు చోరీ చేశారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వీరిని అరెస్ట్ చేసి, రూ.1,47,853 నగదు, 56 తులాల వెండి, 480 మిల్లీగ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును 24 గంటల్లోపు ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు కానిస్టేబుళ్లు ఉసేన్‌బాషా, వీరభాస్కర్, వీరేష్‌లను ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ అభినందించారు.

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో ఏడీఎం సెక్షన్‌లో యూడీసీ (సీనియర్ అసిస్టెంట్)గా విధులు నిర్వహిస్తున్న చిన్న ఉసేనితో పాటు శిరివెళ్ల సబ్‌స్టేషన్ ఆపరేటర్ మోహన్‌ను సోమవారం సస్పెండ్ చేస్తూ ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఓ ఉన్నతాధికారిపై పలు ఆరోపణలు చేస్తూ ప్రధాన కార్యాలయానికి లేఖ రాయడంతో పాటు ఆ లేఖను ఉద్యోగులు, కార్మికుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

బైకును ఢీకొట్టిన కారు.. మహిళ దుర్మరణం


మృతిచెందిన మంజుల

గోనెగండ్ల: మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన సోమవారం ఎస్. లింగందిన్నె గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్ఐ పి. తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కున్నూరు గ్రామానికి చెందిన హరిజన మంజుల (27) సొంత పనుల నిమిత్తం తన అక్క కొడుకు అయిన సురేష్‌తో కలిసి సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కోడుమూరుకు వెళ్లారు. మధ్యాహ్నం పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా ఎస్. లింగందిన్నె గ్రామ సమీపంలో కర్ణాటకకు చెందిన కారు ఢీకొట్టింది. దీంతో మంజుల అక్కడికక్కడే మృతిచెందగా, సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు సురేష్‌ను కోడుమూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతురాలికి భర్త రాజేష్, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్చి పంటను కోసుకెళ్లిన దొంగలు

- లాల్‌మాన్‌పల్లెలో ఘటన


కాయలను కోసుకెళ్లడంతో ఖాళీగా కనిపిస్తున్న మిరప మొక్కలు

కృష్ణగిరి: దొంగలు రూటు మార్చారు. మార్కెట్‌లో మిర్చికి మంచి ధర ఉండడంతో పంట పొలాలపై పడ్డారు. పొలంలో ఉన్న మిర్చి పంటను రాత్రి రాత్రే కోసుకెళ్లారు. ఈ ఘటన లాల్‌మాన్‌పల్లె గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. వడ్డే తిమ్మప్ప తనకున్న 3.70 ఎకరాల్లో బ్యాడిగ రకం మిరప పంటను రూ.6 లక్షలు ఖర్చు పెట్టి సాగుచేశాడు. కాపు బాగా రావడం, మార్కెట్‌లో ఈయేడాది క్వింటాం రూ.50వేలకుపైగా ఉండటంతో తమ కష్టాలు తీరుతాయనుకున్నాడు. మరో 15 రోజుల్లో పంటను కోయాలనుకున్నాడు. అయితే ఆదివారం రాత్రి దొంగలు మొక్కలపై ఉన్న పంటను కోసుకెళ్లారు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు తిమ్మప్ప.. పంట చోరీ అయిన విషయాన్ని గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.3 లక్షలపైగా విలువ చేసే ఆరు క్వింటాళ్ల కాయలు కోసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విష ప్రభావంతో యువ రైతు మృతి


నరసింహులు (ఫైల్)

కోసిగి: పంట పొలాలకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లి విషప్రభావంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. నేలకోసిగి గ్రామానికి చెందిన నరసమ్మ, తాయప్ప దంపతుల కుమారుడు నరసింహులు (22) ఇంటర్ వరకు చదువుకున్నాడు. వ్యవసాయ పనుల వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం వరకు పొలంలో మిరప పంటకు పురుగు మందును పిచికారీ చేసి అస్వస్థతకు గురైయ్యాడు. వెంటనే ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉడడంతో కర్నూలుకు తీసుకెళ్తుండగా సోమవారం ఉదయం మార్గమధ్యలోనే మృతి చెందాడు. కోసిగి ఎస్ఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి, ఆదోని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు.

నంద్యాలకు కర్నూలు ఏరువాక కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏరువాక కేంద్రాన్ని (డాట్ సెంటర్) నంద్యాల జిల్లాకు తరలిస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఏరువాక కేంద్రం నంద్యాల కేంద్రంగా పనిచేయనుంది. ఈ మేరకు ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి జిల్లాలో వ్యవసాయ విస్తరణ విభాగం(ఎక్స్‌టెన్షన్ సెంటర్) ఉండాలనే నిబంధన ఉంది. నంద్యాల జిల్లాలో విస్తరణ విభాగం లేదు. ఆర్ఏఆర్ఎస్ ఉన్నప్పటికీ పరిశోధన(రీసెర్చ్)లకే పరిమితం. అందువల్ల ఏరువాక కేంద్రాన్ని నంద్యాల జిల్లాకు తరలించి అక్కడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించి బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ సేవలు అందించనుంది. బనవాసి కేవీకేలో ప్రధాన శాస్త్రవేత్త/కో–ఆర్డినేటర్‌తో పాటు ఆరు సైంటిస్ట్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఒక్క శాస్త్రవేత్త పోస్టు మాత్రమే ఖాళీగా ఉండటంతో, త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

● 'దొడ్డ' భక్తి



ఈ చిత్రంలో కాళ్లకు కట్టెలు కట్టుకుని నడుస్తున్న వ్యక్తి పేరు దొడ్డ బసప్ప. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కురుగోడు నియోజకవర్గం సిందగేరి గ్రామవాసి. ఉగాది పర్వదినానికి శ్రీశైలం చేరుకునేందుకు స్వగ్రామం నుంచి పాదయాత్రగా బయలు దేరాడు. సోమవారం ఆస్పరి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన ఊరి నుంచి శ్రీశైలానికి 350 కిలోమీటర్ల దూరం ఉంటుందని, తాను ప్రతి ఏడాది పాదయాత్రగా వెళ్తున్నానన్నారు. స్వామికి మొక్కు తీర్చడం కోసం ఈ ఏడాది కాళ్లకు కట్టెలు కట్టుకుని వెళ్లున్నట్లు చెప్పారు.

– ఆస్పరి